పోలీస్ క్రీడాకారులను సన్మానిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

కఠోర శ్రమతోనే ఉన్నత స్థాయికి..

ఎదులాపురం, మార్చి 3: నిరంతర కఠోర శ్రమతో ఉన్నత స్థాయి క్రీడల్లో రాణించవచ్చని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌష్ ఆలం పేర్కొన్నారు. ఇటీవల కరీంనగర్ జిల్లాలో జరిగిన మూడో రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో పాల్గొన్న సిబ్బంది ఎనిమిది రంగాల్లో 10పతకాలు సాధించారు. ఈ మేరకు సోమవారం ఎస్పీ గౌష్‌ఆలం సిబ్బందిని శాలువాతో సత్కరించి అభినందించారు. యోగా, రెజ్లింగ్, కరాటే, వెయిట్‌లిఫ్టింగ్, పరుగుపందెం తదితర పోటీల్లో సిబ్బంది ఏ రూప, పీ మీర్ సింగ్, కే ముకేశ్‌కుమార్, ఏ రుచిత, పీ మీర్ సింగ్, ఎండీ నస్మొద్దీన్, పీ పూజ, ఎం రోహిణి పతకాలు సాధించారు. ఇక్కడ రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డీ వెంకటి, ఎన్ చంద్రశేఖర్, సీసీ దుర్గం శ్రీనివాస్, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారి జైస్వాల్, కవిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణ

ఎదులాపురం, మార్చి3: తెలంగాణ హౌసింగ్ డిపార్ట్‌మెంట్, నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో జిల్లాలోని14 మండలాల్లోని 34మంది తాపీ మేస్త్రి పని చేసే వారికి ఆరురోజుల వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు హౌసింగ్ పీడీ బసవేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక డీపీఆర్సీ న్యాక్ కేంద్రంలో శిక్షణ ప్రారంభించారు. పలువురు అధికారులు ఈ శిక్షణకు సంబంధించి తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇంటి నిర్మాణానికి కావాల్సిన మెళకువలు, పలు సూచనలు వివరించారు. ఇక్కడ ఏఈ నాసిర్ అహ్మద్, పంచాయతీరాజ్ ఈఈ శివరామ్ రాథోడ్, న్యాక్ ఏడీ నాగేంద్రం, శిక్షకులు మహేశ్‌కుమార్, సిబ్బంది దీపక్, రమేశ్, మెరి విక్టోరియా రాణి, తదితరులు ఉన్నారు.

కారులో మంటలు

ఎదులాపురం, మార్చి3: షార్ట్‌సర్క్యూట్‌తో ఓ కారు దగ్ధమైన ఘటన ఆదిలాబాద్‌లో చోటుచేసుకున్నది. పట్టణంలోని ఏరోడ్రమ్ సమీపంలో కృష్ణనగర్ వద్ద ఓ ఎర్టిగా కారులో షార్ట్‌సర్క్యూట్ కారణంగా కారు మొత్తం మంటలు మంటలు వ్యాపించాయి. స్థానికుల సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరిన మంటలను అదుపు చేశారు. కాగా కారులో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

బోథ్, మార్చి 3: బోథ్‌లోని కమ్యూనిటీ దవాఖానలో సోమవారం పార్డీ(బీ) లోని ఆశ్రమ పాఠశాల, వాంకిడిలోని జడ్పీఎస్ఎస్, నేరడిగొండలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం, ఏహెచ్ఎస్, కుంటాలలోని ఏహెచ్ఎస్, బజార్‌హత్నూర్‌లోని ఆదర్శ పాఠశాల, బోథ్‌లోని గురుకుల పాఠశాలలకు చెందిన 92మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 89మందికి అద్దాలు అవసరమని గుర్తించారు. వీరికి 15 రోజుల్లోగా అద్దాలు అందించనున్నారు. శిబిరంలో సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్ర ప్రసాద్, కంటి వైద్య ప్రొఫెసర్ సౌమ్య, ఆప్తాల్మిక్ అధికారి భాస్కర్‌రావు, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి వీణసాగర్, తదితరులు ఉన్నారు.

బాలిక బలవన్మరణం

గుడిహత్నూర్, మార్చి 3: మండలంలోని సూర్యగూడ గ్రామానికి చెందిన గెడం వేదిక(15) కొన్నేండ్ల నుంచి కడుపు నొప్పి సమస్యతో బాధపడుతున్నది. పలు దవాఖానల్లో చూపించుకున్నప్పటికీ నొప్పి మాత్రం తగ్గడం లేదు. సోమవారం కడుపునొప్పి తీవ్రకావడంతో ఇంటి వద్ద పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు గమనించి జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.

సాగునీటిలో ఇబ్బందులు రానివ్వద్దు

- సీఎస్ శాంతి కుమారి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష
- పాల్గొన్న కలెక్టర్, అధికారులు

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అభిలాష అభినవ్, ఆయాశాఖల అధికారులు

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 3: యాసంగిలో పంటలకు సాగునీటిలో ఇబ్బందులు రానివ్వకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో సీఎస్ మాట్లాడుతూ, యాసంగిలో సాగునీటి సమస్య లేకుండా ప్రాజెక్టులు, చెరువులపై సమీక్షించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాల వారీగా సాగు చేస్తున్న పంటల విస్తీర్ణానికి సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఇరిగేషన్ ఎస్ఈ రవిందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ రైతులు ఆందోళన చెందవద్దు

జిల్లాలో మూడేండ్లుగా ఆయిల్‌పామ్ పంటను ప్రోత్సహిస్తున్నామని కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రీ యూనిక్ కంపెనీ ద్వారా ఆయిల్‌పామ్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. సకాలంలో పరిశ్రమ ఏర్పాటు చేయనప్పటికీ ఆయిల్‌పామ్ పంటను కంపెనీ కొనాల్సి ఉంటుందని తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దన్నారు. ప్రతి గింజను ప్రీ యూనిక్ కంపెనీ కొనుగోలు చేస్తుందని తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

సారంగాపూర్, మార్చి3: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శంకర్ సోమవారం ఒక ప్రటకనలో పేర్కొన్నారు. పరీక్ష కేంద్రంలో మొత్తం 635 విద్యార్థులు పరీక్షలు రాయన్నారని తెలిపారు. ఫస్టియర్‌లో 328, సెకండియర్‌లో 307మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంలో డీవోగా నర్సయ్య, సీఎస్‌గా శంకర్ వ్యవహరిస్తారని వెల్లడించారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు కేంద్రానికి గంటముందు రావాలని, ఒక్క నిమిషం ఆలస్యమైతే కేంద్రంలోకి అనుమతించబోమని చెప్పారు.

అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

ఎదులాపురం, మార్చి3: ప్రజావాణిలో వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు అందించారు. కాగా, ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించి 64 అర్జీలు వచ్చాయని తెలిపారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.

విత్తనోత్పత్తిపై రైతులకు శిక్షణ

ముథోల్, మార్చి 3: మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం విత్తన పరిశోధన, సాంకేతికపై రాజేంద్రనగర్, హైదరాబాద్ శాస్త్రవేత్తలు ప్రభావతి, స్వర్ణలత రైతులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేసి, పలు సలహాలు అందజేశారు. ఇక్కడ శాస్త్రవేత్తలు నర్సయ్య, విజయ్, కార్తీక్ ఉన్నారు.

పట్టపగలే చోరీ

ముథోల్, మార్చి 3: వడ్తాల్ గ్రామానికి చెందిన దొడ్డు భోజవ్వ ఇంటికి తాళం వేసి పెండ్లికి వెళ్లింది. ఇదే అదును చూసిన దుండగులు ఇంట్లో చొరబడి నాలుగు తులాల బంగారం, 10తులాల వెండి అపహరించినట్లు బాధితురాలు ఠాణాలో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమాజానికి ఆదర్శంగా నిలువాలి

ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తున్న సభ్యులు

ఎదులాపురం, మార్చి3: నూతనంగా ఉద్యోగాలు సాధించి పదోన్నతులు పొందిన వారు సమాజానికి ఆదర్శంగా నిలువాలని రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గట్టయ్య, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్ట్ కుంటాల రమేశ్ పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవనంలో మాదిగ జాగృతి సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. నూతనంగా, పదోన్నతులు పొందిన ఉద్యోగులకు శాలువా కప్పి జ్ఞాపికలు అందించారు. మహనీయుల చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఇక్కడ ఎంజేఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రమేశ్ మహరాజ్, డీఎస్పీ స్టేట్ సెక్రటరీ అన్నెల లక్ష్మణ్, డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్, అంబేద్కర్ సంఘాల జేఏసీ నాయకులు ఈర్ల దయాకర్, ఆర్టీసీ ఇంజినీర్ శ్రీకర్, ఎంజేఎస్ కోకన్వీనర్ అన్నెల ఆడెల్లు, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న పొచ్చెర గ్రామస్తులు

కల్యాణోత్సవానికి హాజరుకావాలి

బోథ్, మార్చి 3: పొచ్చెర గ్రామంలో మంగళవారం జరుగనున్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవానికి హాజరుకావాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను గ్రామస్తులు ఆహ్వానించారు. సోమవారం నేరడిగొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి కల్యాణోత్సవానికి హాజరుకావాలని కోరారు. ఇక్కడ ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

ఎక్సైజ్ సీవికి నగదు బహుమతి

బహుమతి అందుకుంటున్న ఎక్సైజ్ సీఐ రెండ్ల విజేందర్

ఎదులాపురం, మార్చి 3: విధినిర్వహణలో ఆదిలాబాద్ ఎక్సైజ్ సీఐ రెండ్ల విజేందర్ ఉత్తమ ప్రతిభ కనబర్చారు. సోమవారం ఎక్సైజ్ కమిషనర్ ప్రధాన కార్యాలయంలో రూ.12వేల నగదు బహుమతిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి (ఐపీఎస్) చేతుల మీదుగా అందుకున్నారు. ఇక్కడ డిప్యూటీ కమిషనర్ దేవిద్ రవీకాంత్, జాయింట్ కమిషనర్ కురేషి ఉన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 3: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పేర్కొన్నారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, బాలికలు అన్ని రంగాల్లో రాణించి, జీవితంలో ఉన్నత స్థానంలో నిలువాలన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పరిపాలన విధానం, భవిష్యత్ ప్రణాళిక, మహిళా సాధికారత, బేటీ పడావో బేటీ బచావో ప్రాముఖ్యతపై చర్చించారు. ఇక్కడ శిశు సంక్షేమశాఖ అధికారులు నాగలక్ష్మి, సవిత, తదితరులు ఉన్నారు.

ఆర్జీయూకేటీలో సిమ్యూలేటర్లపై వర్క్‌షాప్

బాసర, మార్చి 3: బాసర ట్రిపుల్ ఐటీలో సోమవారం చండీఘట్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్, రిసెర్చ్ ఆధ్వర్యంలో ఉచిత సిమ్యూలేటర్లను ఉపయోగించి ల్యాబ్ సబ్జెక్టులను బోదించడం అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ, ఐదు రోజులపాటు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇక్కడ ఏవో శ్రీ రణధీర్‌సాగి, అసోసియేట్ డీన్ డా కే మహేశ్, ఈసీఈ విభాగం అధిపతి శ్రీ సాయిరాధాకృష్ణ ఉన్నారు.

వారానికి మూడుసార్లు రక్త శుద్ధి చేయించుకోవాలి

ఎదులాపురం, మార్చి 3: డయాలసిస్ బాధితులు వారానికి మూడుసార్లు రక్త శుద్ధి చేయించుకోవాలని అపెక్స్ (ముంబై) సంస్థ కిడ్నీ డాక్టర్ నెప్రాలజిస్ట్ డాక్టర్ కొమల్ సూచించారు. సోమవారం ముంబై నుంచి టెలీమెడిసిన్ ద్వారా డయాలసిస్ రోగులకు ఉచితంగా సలహాలు, సూచనలు చేశారు. ఆదిలాబాద్ రిమ్స్ దవాఖానలో నూ డయాలసిస్ సెంటర్‌లో రక్తశుద్ధి చేసుకుంటున్న రోగులకు టెలీమెడిసిన్ ద్వారా సందేహాలను నివృత్తి చేశారు. కాగా, ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా 97మంది డయాలసిస్ రోగులు ఉన్నారు. ఇక్కడ డయాలసిస్ సెంటర్ ఇన్‌చార్జి ప్రేమ్‌దాస్, తదితరులున్నారు.

ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీస్‌లు పునరుద్ధరించాలి

ఖానాపూర్ టౌన్, మార్చి 3: ఖానాపూర్ నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని వైజి రెడ్డిమల్ల ఫౌండేషన్, మిసన్ ఐకేర్ ఆప్టికల్స్ అధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ సుజాతరెడ్డికి వినతిపత్రం అందజేశారు. గతంలో కడెం, ఖానాపూర్ నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సులు నడిపేవారని.. ఇటీవల అధికారులు వాటి స్థానంలో డీలక్స్ బస్సులు నడపడంతో ఈ ప్రాంత మహిళలకు మహాలక్ష్మి పథకం వర్తించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు పునరుద్ధరించాలని కోరారు. ఇక్కడ రెడ్డిమల్ల ఏసుదాస్, చిత్రలత, షకీల్ తదితరులు ఉన్నారు.

సోలార్ ప్లాంట్ నిర్మాణం ఎంతో ఉపయోగం

దస్తురాబాద్, మార్చి3: సోలార్ ప్లాంట్ నిర్మాణంతో ప్రజలకు ఎంతో ఉపయోగం ఉంటుందని డీఆర్‌డీవో పీడీ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండల కేంద్రంలో నాలుగు ఎకరాలలో నిర్మించే 1.5మెగా వాట్స్ సోలార్‌ప్లాంట్ స్థలాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్, డీపీఎం వెంకటస్వామి ప్రసాద్, జిల్లా మేనేజర్ శ్రీనివాస్, ఆర్ఐ గంగన్న, ఏపీఎం గంగాధర్, ఏపీవో రవిప్రసాద్, సర్వేయర్ సంధ్యారాణి, జేఎల్ఎం ప్రేమ్, సీసీలు రతిలాల్, లావణ్య, సీఏ వేణు, తదితరులు ఉన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ సామగ్రి

కుంటాల, మార్చి 3: మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్ ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకానికి ఎంపికైంది. ఈ క్రమంలో సోమవారం పాఠశాలకు 12 బ్యాటరీలు, రెండు యూపీఎస్‌లు, ఒక ప్రింటర్, 25ట్యాబ్స్ వచ్చినట్లు ప్రిన్సిపాల్ కాసు నవీన్‌కుమార్ తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ద్విచక్ర వాహనాలు చోరీ

ఎదులాపురం, మార్చి3: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కుమార్ పేట్‌కు చెందిన సాయిప్రసాద్, ద్వారకనగర్‌కు చెందిన జీ రవీందర్ ఆదివారం రాత్రి వారి ఇండ్ల ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు సోమవారం కనిపించలేదు. ఈ మేరకు బాధితులు ఠాణాలో ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఆదిలాబాద్ వన్‌టౌన్ సీఐ బీ సునీల్ కుమార్ తెలిపారు.

వాటర్‌బెల్ విద్యార్థులకు ప్రయోజనం

భైంసా, మార్చి 3: పాఠశాలలో వాటర్‌బెల్‌తో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని ప్రభుత్వ పిల్లల వైద్య నిపుణుడు డా అనిల్ జాదవ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వాటర్‌బెల్‌ను పాఠశాలలో ప్రవేశపెట్టి ప్రతి పీరియడ్‌కు విద్యార్థులు నీరుతాగేలా టీచర్లు ప్రోత్సహించాలన్నారు. వేసవి నేపథ్యంలో పిల్లలు మధ్యాహ్నం వేళలో బయటకు వెళ్లకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

ఎరువుల తయారీపై దృష్టి సారించాలి

దస్తురాబాద్, మార్చి3: ఎరువుల తయారీపై కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీవో రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. భూత్కూర్ జీపీని సోమవారం ఆయన సందర్శించారు. నర్సరీ, పల్లె ప్రకృతి వనం, సేగ్రిగేషన్ షెడ్డును కార్యదర్శి అనిల్‌తో కలిసి పరిశీలించారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

బేల, మార్చి 3: శంషాబాద్ గ్రామానికి చెందిన బెదుడ్కర్ సుధీర్ (27) కొద్దిరోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మనస్తాపం చెంది సోమవారం సదల్‌పూర్ శివారులోని అటవీ ప్రాంతంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సుధీర్ తండ్రి మహదేవ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ లింగన్న తెలిపారు.

జంక్షన్‌లు, డివైడర్లకు ఫ్లెక్సీలు పెట్టవద్దు

- ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ఎల్ జీవన్‌రెడ్డి

ఎదులాపురం, మార్చి 3: రోడ్డు జంక్షన్లు, డివైడర్ల మధ్యలో ఎవరైనా ఫ్లెక్సీలు పెడితే కేసులు నమోదు చేస్తామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫ్లెక్సీ షాప్ యజమానులు, నిర్వాహకులు, సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ నీవీఎన్ రాజుతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, పట్టణంలోని అన్ని జంక్షన్లు, రోడ్డు డివైడర్ ఇరువైపులా ఎట్టి పరిస్థితుల్లోనూ ఫ్లెక్సీలు పెట్టవద్దన్నారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలనుకునేవారు కచ్చితంగా మున్సిపల్ అనుమతి తీసుకోవాలన్నారు. ఫ్లెక్సీలు ఏర్పాటుచేసిన వారే.. మరసటిరోజు ఆ తీయాలన్నారు. డివైడర్ మధ్యలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే, వాటితో ఏదైనా ప్రమాదం జరిగితే నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామన్నారు. కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం ఆదేశాల మేరకు ఇదివరకే జంక్షన్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో సీఐలు బీ సునీల్ కుమార్, సీహెచ్ కరుణాకర్‌రావు, ప్రణయ్‌కుమార్, ఫణిధర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు నిర్వహించండి

నిర్మల్ అర్బన్, మార్చి 3: బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు (8, 9తరగతులు) ఈ నెల 4న పాఠశాలలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించాలని డీఈవో రామారావు సోమవారం ఒక ప్రటకనలో పేర్కొన్నారు. ఈ నెల 5న మండల స్థాయిలో, 6న జిల్లా స్థాయిలో ప్రభుత్వ పాఠశాల ఎన్టీఆర్ స్టేడియంలో పాఠశాలలో ఉదయం 11 గంటలకు పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేర్చుకున్న అంశాలను వినియోగంలోకి తేవాలి

శిక్షణ సమయంలో నేర్చుకున్న అంశాలను వినియోగంలోకి తేవాలని డీఈవో రామారావు సూచించారు. జిల్లాలో 2024 డీఎస్సీలోని ఉపాధ్యాయులకు మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులు అన్ని నైపుణ్యాలు కలిగి ఉంటేనే వృత్తిలో రాణిస్తారన్నారు. ఇక్కడ ఎంఈవో నర్సయ్య, కోర్సు డైరెక్టర్ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

మద్యం పట్టివేత

బోథ్, మార్చి 3: ఇచ్చోడ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఘన్‌పూర్‌లో అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జుల్ఫీకర్ అహ్మద్ తెలిపారు. మహారాష్ట్ర నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను చెవ్వ శ్రీనివాస్ ద్విచక్ర వాహనంపై తీసుకువస్తుండగా ఆదివారం రాత్రి చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుకున్న మద్యం విలువ రూ.8,400 వరకు ఉంటుందని సీఐ తెలిపారు.

5న లబ్ధిదారులకు ఇంటర్వ్యూ

ఇంద్రవెల్లి, మార్చి 3: దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం మండలానికి రూ.50వేలతో ఒక యూనిట్‌ను మంజూరు చేసిందని, ఇందు కోసం ఈ నెల 5న ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5న ఉదయం 11గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు హాజరుకావాలని సూచించారు.

పెళ్లి బరాత్‌లో గొడవ

సోన్, మార్చి 3: నిర్మల్ మండలంలోని రత్నాపూర్‌కాండ్లీ తాండలో ఆదివారం జరిగిన పెళ్లి బరాత్‌లో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మలవత్ రాజు గ్రామంలోని ఓ వివాహానికి హాజరై రాత్రి బరాత్‌లో డ్యాన్స్ చేస్తున్నాడు. అయితే రాజు డ్యాన్స్ చేస్తుండగా సులిగేల శ్రీకర్ 'అరేయ్ నువ్వు మధ్యం తాగి ఉన్నావారా? కంపు వాసన వస్తోంది. నువ్వు ఇక్కడి నుంచి వెళ్లిపో. అని గ్రామస్తుల ముందు అన్నాడు. దీంతో రాజు అక్కడి నుంచి వెళ్లిపోతూ.. నిన్ను ఈ రోజు ఎలాగైనా చంపేస్తానని అనుకుంటూ వెళ్లిపోయాడు. రాత్రి ఒంటి గంటకు బరాత్ అయిపోయాక శ్రీకర్, తన స్నేహితులు కలిసి ద్విచక్రవాహనంపై గ్రామానికి వెళ్తున్నారు. రాజు దారి మధ్యలో ద్విచక్రవాహనానికి అడ్డంవెళ్లి శ్రీకర్ షర్టు పట్టుకుని, మోటారు సైకిల్‌పై నుంచి కిందికి దింపి 'నన్ను మా ఊరిలో అందరి ముందు అవమానపరుస్తావా? అంటూ జేబులో నుంచి కత్తి తీసి పొడిచాడు. దీంతో కుడి కన్ను దగ్గర కత్తి ఇరుక్కపోయింది. వెంటనే స్నేహితులు హుటాహుటిన నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని రాజును రిమాండ్‌కు తరలించినట్లు నిర్మల్ రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు.

లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలి

నిర్మల్ అర్బన్, మార్చి3: నిర్మల్ పట్టణం, ఖానాపూర్, భైంసా కోర్టులలో ఈ నెల 8న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ జానకి షర్మిల సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజీ మార్గమే రాజ మార్గమనే సూత్రాన్ని అనుసరించి వివాదాలను చక్కదిద్దుకోవడానికి లోక్‌అదాలత్ చక్కటి వేదిక అని తెలిపారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ఎదులాపురం, మార్చి 3: ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి అక్రమంగా మదర్సా కట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని హిందువాహిని జిల్లా శాఖ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి వినతిపత్రం అందజేశారు. ఇక్కడ రాళ్ల బండి మహేందర్, గండ్రత్ మహేందర్, కందుల చాణక్య, నవనీత్ ఉన్నారు.

విధులకు ఆటంకం.. కేసు నమోదు

లోకేశ్వరం, మార్చి3: రాజురా గ్రామం నుంచి ముకేశ్ అనే వ్యక్తి మద్యం తాగి ఇబ్బంది పెడుతున్నాడంటూ భోజన్న అనే వ్యక్తి డయల్ 100కి కాల్ చేశారు. వెంటనే పోలీస్ సిబ్బంది రాజ్‌కుమార్, నీలేష్ ఘటనా స్థలానికి వెళ్లారు. ముకేశ్‌ను సముదాయించే ప్రయత్నం చేయగా, అతడి చిన్నాన్న కొడుకు నమోశ్ల ఎల్లప్ప పోలీస్ సిబ్బందితో గొడవకు దిగాడు. విధుల కు ఆటంకం కలిగించాడంటూ కానిస్టేబుల్ నీలేష్ ఠాణాలో ఫిర్యాదు చేయగా ఎల్లప్పపై కేసు నమోదు చేశామని ఎస్ఐ అశోక్ తెలిపారు.

ఎల్ఆర్ఎస్ రుసుంలో రాయితీ

ఖానాపూర్, మార్చి 3: ఈ నెల 31లోపు ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లించే వారికి రాష్ట్ర ప్రభుత్వం 25శాతం రాయితీ కల్పించిందని ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లేఅవుట్లు లేని ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఈ నెల 31వరక